# దేవుడు కొడతాడు

బోడపాటి రమేష్

శ్రీకాంత్ ఇంటికి వచ్చేసరికి గుమ్మంలోనే అతని రెండేళ్ళ కొడుకు 'నాన్నా' అంటూ ఎదురయ్యాడు.

ఆఫీసు నుండి ఇంటికి వస్తూనే గడపలో ఎదురయ్యే కొడుకుని ఎత్తుకుని ముద్దాడుతూ ఇంట్లోకి వెళ్ళటం శ్రీకాంత్ ఇటీవల దిన చర్యల్లో ఒక భాగంగా అవుతున్నది.

హరీష్‌నెత్తుకో బోయిన అతను, కొడుకు బట్టలు మురికిగా కనబడటంతో "ఏమిటి రమా! ఈ పూట స్నానం చేయించలేదా" అని భార్యను అడుగుతూ ఇంట్లోకి అడుగు పెట్టాడు.

"రాగానే మొదలు పెట్టారు. మీ అబ్బాయి ఉన్న చోట ఉంటాడా. మీ రొచ్చే ముందే స్నానం చేయించి బట్టలు మార్చాను"

"ఏరా నాన్నా! అమ్మ చెప్పింది నిజమేనా" అన్నాడు కొడుకును ఎత్తుకుంటూ.

"బొబ్బి పోచుకుని ఆడుకోటాని కెళ్ళాను" అన్నాడు హరీష్ తండ్రి షర్ట్ జేబులు తడుముతూ.

"తప్పు నాన్నా. నాన్నగారి జేబులో ఏముండవు." అన్నది రమ కంగారుగ కొడుకును భర్త దగ్గర నుంచి లాగేస్తూ.

ఎందుకనంటే అతని జేబులో ఒకటి అరా సిగరెట్లు ఉంటాయి. ఇకనైనా మీ అలవాటు మానండి అని చెపుతూనే ఉంటుంది అయినా శ్రీకాంత్ అంతగా పట్టించుకోడు. చిరునవ్వు నవ్వేస్తాడు. గట్టిగా అడిగితే అది నీ కంటే ముందే నా జీవితంలోకి ప్రవేశించింది. అంచేత నీ కంటే సీనియర్ అంటాడు.

రమకు ఇందులో లాజిక్ ఏమిటో అర్థం కాక పోయినా ఈ విషయంలో భర్తతో వాదన పెట్టుకోదు. కాని పెద్ద వాడవుతున్న పిల్లవాడి మీద ఈ అలవాటు ప్రభావం ఉంటుందని ఆమె భయం.

భార్య ఇచ్చిన టిఫిన్ ప్లేట్ అందుకుంటూ "ఏమిటి హరీష్ ఈ మధ్య బాగా అల్లరి చేస్తున్నట్లున్నాడు. పైగా ఇరుగు, పొరుగు పిల్లలతో ఆటలు కూడా ఎక్కువయి నట్లున్నాయి" అన్నాడు.

"బోలె డాటలొచ్చాయి" అన్నాడు హరీష్.

"ఆటలయితే ఫరవాలేదు కాని ఈ మధ్య ఎక్కడ నేర్చుకున్నాడో ఏమిటో" అంటూ అర్థోక్తితో ఆపేసింది రమ.

విషయం అర్థం చేసుకున్న శ్రీకాంత్ "చిన్న పిల్లాడు కదా. మనం నెమ్మదిగా చెపితే సర్దుకుంటాడు. నాన్నా హరీష్ అటువంటి మాటలు మాట్లాడకూడదు తప్పు" అన్నాడు నవ్వుతూ కొడుకుని దగ్గరకు తీసుకుంటూ.

హరీష్ తనకేమీ పట్టనట్లు తండ్రి టిఫిన్‌లో భాగం పంచుకుంటున్నాడు. అయితే రమ మాత్రం "ఈ సారి విన్నానంటే వాతలు పెడతాను" అంటూ అవతలికి వెళ్ళిపోయింది.

"మాసావా, అమ్మకు నీ మీద కోపం వచ్చింది. తప్పు అట్లా మాట్లాడొద్దు. దేముడు కొడతాడు" అన్నాడు.

అర్థమయినట్లుగా తల ఊపాడు హరీష్.

** ** **

"రమా రమా, ఏమిటి ఈ షర్టు నిండా మరక లున్నాయి" ఆఫీస్‌కు ఆలస్యమవుతోందని హడావుడి పడుతన్నాడేమో బుష్ షర్ట్ మరకలు అతని చికాకును ఎక్కువ చేసాయి.

"ఏదీ చూడ నివ్వండి. అయ్యో విక్షేపం లాంటి కొత్త షర్టు. ఎక్కడ ఆరేసాడో ఏమిటో. ఉండండి ఈ సారి బట్టలుకొచ్చినప్పుడు నిలదీసి అడుగుతాను" అన్నది రమ నొచ్చుకుంటూ.

"ఈ మధ్య వాడికి కళ్ళు నెత్తి మీదకొచ్చాయి ... ... ..."

హరీష్ అక్కడే ఆడుకుంటున్నాడు. తండ్రి మాట వినటంతో తలెత్తి చూసి నవ్వాడు " తప్పు నాన్నా దేముడు కొడతాడు" అంటూ.

